AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

నాగిరెడ్డిపేటలో చిరుత కలకలం



2



2

రోడ్లపైనే మూగ జీవాలు

శ్రీహరికోట పర్యటనకు విద్యార్థులు

అక్షరటుడే, కామారెడ్డి : నెల్లూరులోని శ్రీహరికోటలో గల సతీష్ ధావన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ పర్యటనకు జిల్లాలో పదోతరగతి చదువుతున్న 50 మంది విద్యార్థినులు వెళ్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది అక్టోబర్ లో నిర్వహించిన ఎంపిక పరీక్ష ద్వారా ప్రతిభావంతులైన 50 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి పర్యవేక్షణలో విద్యార్థినులు ఈనెల 28న పర్యటనకు వెళ్తున్నారన్నారు. విద్యార్థులతో పాటు 30 మంది ఉపాధ్యాయులు కూడా శ్రీహరి కోటకు వెళ్లనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

అభివృద్ధి చేస్తే చరిత్ర పుటల్లో నిలుస్తాం: షబ్బీర్ అలీ

అక్షరటుడే, కామారెడ్డి: ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి చేసినప్పుడే మనపేరు చరిత్ర పుటల్లో నిలుస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. పట్టణంలో శనివారం అమృత్ 2.0 పథకం కింద రూ.65.80 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణంలో తాగునీటి సౌకర్యం కోసం భారీ నిధులు కేటాయించామన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు నాలుగు నూతన భారీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇస్లాంపుర కాలనీ, లిటిల్ స్కాలర్ స్కూల్, గ్రీన్ సిటీ కాలనీ, డ్రైవర్స్ కాలనీలో నిర్మించబోయే వాటర్ ట్యాంకుల పనులకు శంకుస్థాపన చేశారు.

ప్రజోపయోగ పనులకు స్థలాలు గుర్తించాలి

అక్షరటుడే, ఇందూరు : అభివృద్ధి పనుల నిర్మాణాల కోసం అనువైన భూములను గుర్తించే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, కస్తూర్బా, ఆరోగ్య ఉపకేంద్రాలు, నర్సింగ్ కళాశాల, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర వాటికి సొంత భవనాల నిర్మాణాల కోసం అనుమతి వచ్చిందని తెలిపారు. ఇప్పటికే స్థల నిర్ధారణ పూర్తయిన చోట పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు స్థల సమస్య కారణంగా ల్యాప్స్ కాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా స్థలాలు కబ్జాకు గురయితే అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, ఆర్డీవో రాజేంద్ర కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, ఎన్ఎంసీ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

చోరీల నివారణకు సీసీ కెమెరాల దోహదం

అక్షరటుడే, కామారెడ్డి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు రక్షణ కవచాలుగా పని చేస్తాయని కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి అన్నారు. శనివారం దోమకొండ మండలం అంబర్ పేటలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం కింద ఏర్పాటు చేసిన 18 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. నేరాలను ముందుగానే అరికట్టడానికి సీసీ కెమెరాలు ఒక ప్రభావవంతమైన సాధనమని, దొంగతనాలు, చైన్ స్నాచింగ్, వాహనాల దొంగతనాల నివారణలో ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, దోమకొండ ఎస్సై ప్రభాకర్ పాల్గొన్నారు.

కొత్త ఆశావహులు..

మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తుడడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రధాన పార్టీల నుంచి పోటీ చేయాలనే తపనతో పలువురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో చాలా మంది కొత్త నాయకులు ఉన్నారు. గతంలో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారికి పోటీగా తాము బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఆయా పార్టీల నుంచి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు దగ్గరి నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అంతేకాకుండా తమకే టికెట్ వస్తుందన్న నమ్మకంతో ముందు నుంచే జోరుగా ప్రచారానికి తెరలేపారు.

- అక్షరటుడే, ఇందూరు

- పార్టీల సీట్ల కోసం పోటాపోటీ ప్రయత్నాలు
- మున్సిపల్ ఎన్నికల బరిలో దిగేందుకు సన్నద్ధం
- షెడ్యూల్‌కు ముందు నుంచే జోరుగా ప్రచారం

ఉమ్మడి జిల్లాలో ఏడు మున్సిపాలిటీలతో పాటు నగరపాలక సంస్థలో ఎన్నికలు జరగనున్నాయి. ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలో హడావుడి మొదలైంది. అయితే నగరపాలక సంస్థలో మొత్తం 60 డివిజన్లన్నాయి. ఇందులో అన్ని పార్టీల నుంచి పోటీ తీవ్రంగానే ఉంది. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ లకు కొత్తవారు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో డివిజన్ నుంచి సుమారు 10 నుంచి 20 మంది ఆశావహులు తమ ఇష్టమైన పార్టీలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. నిజామాబాద్ నగరంలోని 50వ డివిజన్‌కు బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తూ సుమారు 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సగానికి పైగా కొత్తవారే ఉండడం గమనార్హం. అలాగే నగరంలోని మైనారిటీ ఏరియాలోనూ ఈసారి కాంగ్రెస్, ఎంఐఎం నుంచి పోటీ చేసేందుకు పలువురు కొత్తవారు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటి నుంచే ప్రచారం..

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ ప్రకటించలేదు. పార్టీలు కూడా తమ అభ్యర్థులను అధికారికంగా వెల్లడించలేదు. కానీ పలువురు ఆశావహులు ప్రధానంగా కొత్తవారు ఇప్పటినుంచే తమ ప్రచారం ప్రారంభించారు. తమకు టికెట్ ఖరారు అవుతుందని ఆశాభావంతో జోరుగా ప్రచారం చేస్తున్నారు. రథసప్తమి, గణతంత్ర దినోత్సవం, ఇటీవల జరిగిన సుభాష్ చంద్రబోస్ జయంతి, వసంత పంచమి ఇలా ప్రత్యేక రోజుల శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు వెలిశాయి. అలాగే కాలనీలలో పెద్దలను కలుస్తూ ప్రచారం చేస్తున్నారు. తమకు టికెట్ రావడం ఖాయమని చెబుతున్నారు.

రిజర్వేషన్ల తారుమారుతో కొత్తవారికి ఛాన్స్!

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా రిజర్వేషన్లను ఇటీవల విడుదల చేశారు. అయితే నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు అన్ని మున్సిపాలిటీలలో గతంతో పోల్చితే వార్డుల రిజర్వేషన్లు తారుమారయ్యాయి. దీంతో కొత్త ఆశావహులు తెరమీదకి వచ్చారు. ఖర్చులకు కూడా వెనకాడకుండా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. కొందరైతే తమకు పలానా పార్టీ నుంచి సీటు ఖరారు కానుందని, గెలిపిస్తే డివిజన్, వార్డు అభివృద్ధిలో భాగంగా ఆయా పనులు చేస్తామంటూ హామీల వర్షం సైతం కురిపిస్తున్నారు.

> మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే స్టేట్ ఎలక్షన్ కమిషన్ ప్రక్రియ పూర్తి చేస్తుంది. షెడ్యూల్ ప్రకటించడమే మిగిలింది. అయితే ఈ సారి ఎన్నికల బరిలో కొత్త ఆశావాహులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. పోటీలో నిలబడేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

భారీగా దరఖాస్తులు

ప్రధాన పార్టీల టికెట్ల కోసం ఆశావాహులు భారీగానే దరఖాస్తు చేసుకున్నారు. అయితే సీటు ఖరారుపై ఉత్కంఠతో ఉన్నారు. షెడ్యూల్ ప్రకటించిన తరువాత పార్టీల నాయకులు బలమైన అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో ఉంటారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు అధికారులు ప్రజాప్రతినిధులు శరవేగంగా శంకుస్థాపనలు, భూమి పూజలు చేస్తున్నారు. దీంతో షెడ్యూల్ త్వరలోనే ప్రకటించే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కొత్త అభ్యర్థులు ఎందరు గెలుపొందుతారనేది వేచిచూడాల్సిందే.

పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి: ఎస్పీ

అక్షరటుడే, కామారెడ్డి : పోలీసు శాఖలో పదోన్నతులు బాధ్యతను పెంచుతాయని, రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలందించాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఏఎస్సైగా పదోన్నతి పొందిన డి.దేవరాజు ఎస్పీని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతి చిహ్నాలను అలంకరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. పదోన్నతులు కేవలం హోదా మార్పు మాత్రమే కాదని, విధి నిర్వహణలో బాధ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. పదోన్నతి పొందిన సిబ్బంది తమ జీవనశైలిని మెరుగుపరుచుకుని ప్రజలకు మరింత చేరువగా ఉండి నిజాయితీతో సేవలు అందించాలని సూచించారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అక్షరటుడే, బోధన్ : ప్రతిఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఇందూర్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో డీజీపీ ఆదేశాల మేరక 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకటనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషోర్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులకు నోటీసులు జారీ చేయాలి: కలెక్టర్

అక్షరటుడే, కామారెడ్డి: ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. అందుకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆస్పత్రులకు జరిమానాలు విధిస్తూ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 అమలుపై జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. అన్‌రిజిస్టర్డ్ ఆస్పత్రుల నివేదికలను డీఎంహెచ్‌వో విద్య ఆధ్వర్యంలో సేకరించి డీఆర్ఏ కమిటీకి సమర్పిస్తామన్నారు. జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ ఆమోదం మేరకు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది ఆస్పత్రికి వచ్చిన రోగుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, రోగులకు సరైన చికిత్స అందించాలని సూచించారు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సమయంలో డీఆర్ఏ కమిటీకి సమర్పించిన ప్రైస్ లిస్ట్, ప్రొసీజర్‌ల ప్రకారమే రోగుల వద్ద ఫీజులు వసూలు చేయాలని ఆదేశించారు.

అనుమతి పొందిన ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది మార్పులు జరిగితే వాటిని తప్పనిసరిగా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీకి తెలియజేయాలన్నారు.

సివిల్ సప్లయ్స్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డిలోని సమీకృత కార్యాలయాల భవనంలో ఏసీబీ సోదాలు కలకలం సృష్టించాయి. కలెక్టరేట్‌లోని సివిల్ సప్లయ్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న ఏసీబీ అధికారులు సాధారణ వ్యక్తుల మాదిరిగా కలెక్టరేట్ మొత్తం తిరిగినట్టుగా తెలుస్తోంది. అనంతరం గంట తర్వాత సివిల్ సప్లయ్స్ కార్యాలయంలోకి వెళ్లి సిబ్బంది ఫోన్లు తీసుకుని సోదాలు చేపట్టినట్లు సమాచారం. కార్యాలయ సిబ్బంది ఎవరు ఏ విధులు నిర్వర్తిస్తారు అనే వివరాలు తీసుకుని కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అయితే ఆకస్మికంగా ఏసీబీ సోదాలు జరగడం కలకలం రేపింది. సాధారణ తనిఖీల్లో భాగంగానే సోదాలు చేపడుతున్నారా..? లేక ఎవరైనా ఫిర్యాదు చేశారా.. అనేది చర్చనీయాంశంగా మారింది. సోదాలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గంజాయి బ్యాచ్ హల్‌చల్.. కారుతో కానిస్టేబుల్‌ను ఢీకొట్టి..

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: గంజాయి బ్యాచ్‌ను పట్టుకునే క్రమంలో ఓ మహిళ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నిజామాబాద్ నగరంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎక్సైజ్ కమిషనర్ సోమిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి నగరంలోకి ఎందు గంజాయిని తీసుకొస్తున్నారనే పక్కా సమాచారంతో ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో రూట్ వాచ్ నిర్వహించారు. ఈ క్రమంలో నగరంలోకి అనుమానాస్పదంగా వచ్చిన కారును ఆపాలని కోరగా కారు డ్రైవర్ ఆపకుండా ఎక్సైజ్ కానిస్టేబుల్ జి సౌమ్యను ఢీకొట్టి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ రోడ్డుపై పడిపోగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటన జరిగిన వెంటనే ఎక్సైజ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. పారిపోతున్న కారును పట్టుకొని అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి దగ్గర నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

సౌమ్యకు న్యాయం చేయాలని ఎక్సైజ్ ఉద్యోగుల ఆందోళన

ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు న్యాయం చేయాలని ఆ శాఖ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. శనివారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. సౌమ్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

నాగిరెడ్డిపేట్‌లో చిరుత కలకలం..

అక్షరటుడే, ఎల్లారెడ్డి : నాగిరెడ్డిపేట మండలంలో చిరుత సంచారం కలకలం సృష్టిస్తోంది. తాండూర్ గేట్ సమీపంలోని ధర్మారెడ్డి అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారి దాటుతూ శనివారం ఉదయం 11 గంటలకు స్థానికులకు చిరుత కనిపించింది. దీంతో ఈ విషయాన్ని స్థానికులు నాగిరెడ్డిపేట మండల అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ రేంజ్ అధికారి వాసుదేవ్ తన రేంజ్ సిబ్బందితో కలిసి తాండూర్ గేట్ సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి చిరుత ఆచూకీపై తనిఖీ చేశారు. అక్కడ చిరుతపులి పాద ముద్రలు, స్కాట్స్ (విసర్జితం) గుర్తించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. ధర్మారెడ్డి అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లుగా నిర్ధారణ జరిగినందున అడవి సమీపంలోని తాండూర్, ధర్మారెడ్డి, బంజారా తండా, లింగంపల్లి కలాన్ గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు తెలిపారు. రైతులు సాయంత్రం నుంచి ఉదయం వరకు ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. తనిఖీల్లో డీఆర్వో రవికుమార్, బీట్ అధికారి నవీన్ బేస్ క్యాంప్ సిబ్బంది గోపాల్ పాల్గొన్నారు.

రేపు మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల ప్రారంభం

అక్షరటుడే, బోధన్ : పట్టణ శివారులోని పాండుఫారం వద్ద రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను ఆదివారం ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పాషా తెలిపారు. ఈ మేరకు శనివాం మీడియా సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రారంభోత్సవానికి ప్రభుత్వ ముఖ్య సలహాదారు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్యఅతిథిగా వస్తున్నారన్నారు. అలాగే బోధన్ మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఎల్లయ్య, మాజీ కౌన్సిలర్ శరత్ రెడ్డి పాల్గొన్నారు.

25న సామూహిక సూర్యనమస్కారాలు

అక్షరటుడే, ఇందూరు: నగరంలోని బస్వా గార్డెన్‌లో రథసప్తమి సందర్భంగా సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు పతంజలి యోగా కేంద్రం అధ్యక్షుడు యోగారత్న ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. యోగాతో అనారోగ్యం దరిచేరదని యోగా గురువు కిషన్ పేర్కొన్నారు. యోగా సాధకులు ఆదివారం ఉదయం 6 గంటలకు వినాయక్‌నగర్‌లోని బస్వాగార్డెన్‌కు రావాలని సూచించారు.

గ్రామస్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

అక్షరటుడే, ముప్కాల్: వేంపల్లి గ్రామంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో పోలీసులు 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి కిరణ్ పాల్ గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో వేంపల్లి సర్పంచ్ ఏట్టెం మహేష్, ఆలయ కమిటీ ఛైర్మన్ నరేష్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మూగ జీవాలు

■ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ■ అవగాహన కల్పించని పోలీసు అధికారులు

రోడ్లపై తిరుగుతున్న మూగజీవాలతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై పశువులు అడ్డు రావడంతో ఇటీవల ఓ బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. అకస్మాత్తుగా రోడ్లపైకి వచ్చే మేకలు, గొర్రెలు, గేదెల కారణంగా పలువురు గాయాలపాలవుతున్నారు. అయితే పశువుల కాపర్లకు అవగాహన కల్పించేవారు లేకుండా పోయారు.

– అక్షరటుడే, గాంధారి

గాంధారి మండలంలో కొందరు పశువుల కాపర్లు రోడ్లపైనే వందల కొద్దీ మేకలను, గొర్రెలను దర్జాగా తోలుకుంటూ వెళ్తున్నారు. దీంతో వాహనదారులకు వీటి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గాయపడ్డ క్షత గాత్రులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. ఇటీవల మండలంలో రోడ్డుపై బైక్‌పై భార్యభర్తలు వెళ్తుండగా అకస్మాత్తుగా మేకలు రోడ్డపైకి అడ్డురావడంతో కిందపడి వారిద్దరూ గాయాలపాలయ్యారు. ఇంకా బయటకు రాని ఘటనలు ఎన్నో ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు.

ఆస్పత్రుల్లో రూ.వేల్లో ఖర్చులు..

పశువుల కారణంగా గాయాలపాలైన వారు ఏమీ చేయలేక ఆస్పత్రుల్లో రూ.వేల్లో ఖర్చు చేసి చికిత్స పొందుతున్నారు. మూగజీవాలను రోడ్లపైకి తీసుకురావొద్దని చెప్పేవారు లేకపోవడంతో పశువుల కాపర్లు ఇష్టారాజ్యంగా మేకలు, గొర్రెలు, గేదెలను రోడ్లపై నడిపిస్తున్నారు. ప్రమాదానికి గురైన కుటుంబం నెలల తరబడి ఆస్పత్రుల పాలైతే.. ప్రమాద తీవ్రత ఎక్కువై మరణిస్తే ఆ కుటుంబాల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

గతేడాది మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా అకస్మాత్తుగా పెట్రోల్ బంక్ వద్ద మేక అడ్డు రావడంతో నా కాలు విరిగింది. అంతేకాక నాతో ప్రయాణిస్తున్న వారికి కూడా గాయాలయ్యాయి. మూగజీవాలను రోడ్డుపై ఇష్టానుసారంగా నడిపించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని అధికారులు కట్టడి చేయాలి. దాదాపు 45 రోజులు ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం కోలుకున్నాను. పోలీసు అధికారులు పశువుల కాపర్లను అవగాహన కల్పించాలి. **– కృష్ణ, బాధితుడు**

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే..

అక్షరటుడే, మెండోరా: మద్యం తాగి వాహనాలు నడిపితే న్యాయస్థానాలు కఠినశిక్షలు విధిస్తాయని ఎస్సై సుహాసిని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని.. కారులో వెళ్లేటప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని చెప్పారు. విద్యార్థులు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు నిబంధనల గురించి వివరించే విధంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలి

అక్షరటుడే, బాన్సువాడ: వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సీఐ తుల శ్రీధర్ సూచించారు. బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బైక్‌పై వెళ్లే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కళాకారులు పాటలు, డప్పు చప్పుల ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు ఆకుల మహేందర్, రమేష్, రావు, నాగరాజు, లక్ష్మీనారాయణ, రాము, పోశెట్టి తిరుపతి, కాశీరాం, నరేష్, సవిత, శిల్ప, దివ్య, లత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవానికి సునీల్‌రెడ్డికి ఆహ్వానం

అక్షరటుడే, మప్కాల్: వేంపల్లి గ్రామంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు నరేష్, నాయకులు కలిసి కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లి కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతికి కృషి చేయాలి

అక్షరటుడే, ఇందూరు : బాలికల అభ్యున్నతికి కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలో చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికలు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకునేలా ఉపాధ్యాయులు వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ర్యాలీ పాత కలెక్టరేట్ గ్రౌండ్ నుంచి తిలక్‌గార్డెన్ మీదుగా ఖలీల్‌వాడిలోని న్యూ అంబేద్కర్ భవన్ వరకు కొనసాగింది.

దేశ నాయకుల చిత్రపటాల అందజేత

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని జిరాయత్ నగర్ ప్రాథమిక పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో దేశ నాయకుల చిత్రపటాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జక్కుల రాధాకిషన్ మాట్లాడుతూ.. దేశానికి ఎంతో సేవలు చేసిన మహనీయుల చిత్రపటాల పంపిణీ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నాయకుల అడుగుజాడల్లో నడిచి దేశానికి మన వంతు సేవలు అందించాలని తెలిపారు. పాఠశాల హెచ్ఎం సంతోషి రాణి మాట్లాడుతూ.. మహాత్ముల చిత్ర పటాలను పంపిణీ చేసినందుకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఆర్మూర్ కార్యదర్శి ఖాందేష్ సత్యం, వన్నల్ దేవి రాము, మాజీ అధ్యక్షుడు పుష్పాకర్ రావు, రజనీష్ కిరాడ్, మాజీ కార్యదర్శి రాస ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో ఏడేళ్ల బాలిక మృతి

అక్షరటుడే, గాంధారి : పాముకాటుకు గురై ఏడేళ్ల బాలిక మృతి చెందింది. ఈ హృదయ విదారక ఘటన గాంధారి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని మేడిపల్లి గ్రామంలో గల చందా నాయక్ తండాలో మాయ అనే బాలిక తన తల్లితో పొలానికి వెళ్లింది. తల్లి పొలంలో పని చేస్తుండగా బాలిక ఒడ్డుపై ఫోన్ చూస్తూ కూర్చుంది. తన తల్లి భోజనం చేసేందుకు పిలవగా మాయ ఒడ్డుపైన నడుచుకుంటూ వెళ్తూ పొరపాటున పాముపై కాలువేసింది. దీంతో పాము కాటు వేయగా వెంటనే తన తల్లికి సమాచారం ఇచ్చింది. దీంతో ఆమె కూతురుని తీసుకుని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. ఉన్న ఒక్కగానొక్క కూతురు మృతి చెందడంతో తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ ఘటనతో చందానాయక్ తండా లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆర్టీసీ బస్టాండ్ బాత్‌రూంలో శిశువు మృతదేహం లభ్యం

అక్షరటుడే, బాన్సువాడ: నవమాసాలు మోసి కన్న నవజాత శిశువును ఆర్టీసీ బస్టాండ్ బాత్‌రూంలో వదిలి వెళ్లిన ఘటన కలకలం రేపింది. బాన్సువాడ పట్టణంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. బస్టాండ్ బాత్‌రూంను శుభ్రం చేయడానికి వెళ్లిన కార్మికుడు అక్కడ మృతి చెందిన నవజాత శిశువును గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. శిశువును అక్కడ వదిలి వెళ్లిన మహిళ ఎవరనే దానిపై విచారణ చేపట్టారు.

పోతంగల్ మండలంలోని బాకర్ ఫారం సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. అయితే సంబంధిత అధికారులకు లీకేజీ సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవట్లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. లీకేజీ కారణంగా తమ గ్రామంలోకి నీళ్లు రావట్లేదని వాపోయారు. వెంటనే మిషన్ భగీరథ అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

– అక్షరటుడే, కోటగిరి

డిగ్రీ పరీక్షల్లో 'ఉషోదయ' విద్యార్థుల ప్రతిభ

అక్షరటుడే, బోధన్ : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన డిగ్రీ పరీక్ష ఫలితాల్లో ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని కళాశాల డైరెక్టర్ సూర్య ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ ఫస్టియర్‌కు గాను 6,090 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో ఉషోదయ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారని సూర్య ప్రకాష్ తెలిపారు. అదేవిధంగా మూడో సంవత్సరంలో ఓ విద్యార్థి 10/10 జేపీఏ సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, మహిళా కళాశాల ప్రిన్సిపల్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తాం

అక్షరటుడే, బోధన్ : రాబోయే బోధన్ మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి తరపున పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ నాయకుడు రజాక్ తెలిపారు. ఈ మేరకు శనివారం మీడియాతో మాట్లాడారు. బోధన్ మున్సిపాలిటీలో ఉన్న 38 స్థానాల్లోనూ తమ అభ్యర్థులను నిలబెడతామన్నారు. ఎవరైనా తమ పార్టీ నుంచి పోటీ చేయదలుచుకున్న వారు తమను సంప్రదించాలని కోరారు. జాగృతి నుంచి పోటీ చేయదలచిన వారికి ఎన్నికల కమిషన్ సింహం గుర్తు కేటాయించిందన్నారు. విలేకరుల సమావేశంలో ప్రవీణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.